క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చుంచుపల్లి: వేసవి దృష్ట్యా సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్‌లో శనివారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వాహనం ద్వారా మంటలు ఆర్పే విధానాన్ని వివరించారు. మంటలు అంటుకుంటే చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలను సిబ్బంది ప్రయాణికులకు తెలియజేశారు. వేసవికాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను డెమో ద్వారా చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ


రక్త నమూనా సేకరిస్తున్న వైద్యసిబ్బంది

పాల్వంచరూరల్: మారుమూల గిరిజన ప్రాంతమైన రాళ్లచెలక ఆదివాసీ గిరిజన గ్రామంలో శనివారం ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది మలేరియా వ్యాధి నిర్మూలన కోసం మాస్ స్క్రీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 86 మంది గిరిజనుల నుంచి రక్త నమూనాలను సేకరించి పీహెచ్‌సీ ల్యాబ్ టెస్ట్ పంపించంగా ఇద్దరికి మలేరియా వ్యాధి లక్షణాలు ఉన్నట్లు రాడికల్ టెస్ట్ ద్వారా నిర్ధారించారు. వారికి మందులు అందజేశారు. మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ వాసం చైతన్యకుమార్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, శంకర్, ఆశ, యశోద పాల్గొన్నారు.

వితరణ

టేకులపల్లి: ప్రెగళ్లపాడు పంచాయతీ యూత్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా, వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. తూర్పుగూడెం గ్రామానికి చెందిన తాటి వీరభద్రం కొంత కాలంగా నరాల బలహీనతతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న యూత్ సభ్యులు బాధితుడికి రూ.7వేలు ఆర్థిక సాయం అందజేశారు. జోగ కోటమ్మ ఇటీవల మరణించడంతో కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. కొండబత్తుల శ్యామ్, కోరం శ్రీకాంత్, నర్సింగ్ సుదీప్, లక్కినేని రంగా, జార వెంకటేశ్, తాటి రాజేష్, కోరం అనిల్, జార మల్లేష్, వాగబోయిన నిశాంత్, పూనెం బాలకృష్ణ, పోలెబోయిన బాలకృష్ణ, ధన్ను, చిట్టి రాజు, లింగమల్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ వేపలగడ్డ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సక్రియా కుటుంబానికి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సహకారంతో ఆ పార్టీ నాయకులు శనివారం క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, వైస్ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు గాజీ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, నందు, చిట్టిబాబు, రమేష్, కౌసల్య, శాంత పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ

టేకులపల్లి: ఎమ్మెల్యే హరిప్రియ భర్త, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోతు హరిసింగ్‌నాయక్ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం సులానగర్ బీఆర్ఎస్ యూత్ నాయకుల ఆధ్వర్యంలో హేమచంద్రాపురంలోని అమ్మ అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు, బ్రెడ్ అందజేశారు. బోడ రమేష్, కుమ్మరి కిరణ్, కొట్టె సురేష్, కుమ్మరి గురువయ్య, కమలాకర్, చంటి, రవి, కుమార్, ఎలేషియా, రాజ్‌కుమార్, వినోద్, బాలాజీ , సందీప్, నెహ్రూ పాల్గొన్నారు.

20న ప్రజాపోరు యాత్ర


ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): దేశ సమగ్రత, సమైఖ్యత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న ప్రారంభమైన ప్రజాపోరు యాత్ర ఈనెల 20న చుంచుపల్లి మండలం గౌతంపూర్‌కు చేరుకుంటుందని ఈ యాత్రకు అన్ని వర్గాల ప్రజలు నీరాజనం పలికి విజయవంతం చేయాలని, సీపీఐ, ప్రజాసంఘాల నాయకుడు వై.శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలో ప్రజాపోరు యాత్రకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల పేదప్రజలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని, ఆసరా పింఛన్లు, కొత్తరేషన్ కార్డులు, ఇంటిస్థలాలు, పట్టాలు, ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గద్దం రాజయ్య, మోతుకూరి శంకర్, గద్దం ప్రభాకర్, చిలుక కృష్ణ, మరాటి మోహన్, మామిడిపల్లి రఘు, బోయిన సత్యనారాయణ, మహంకాళి నారాయణ, కృష్ణ, ఎనగందుల రామకృష్ణ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెం పెద్దబజార్‌లోని ఓ షోరూంలో అమ్మకానికి కూలర్లు, ఏసీలు




సూపర్‌బజార్‌లో కూలర్ కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఎండాకాలంలో కూల్.. కూల్

సండే స్పెషల్

పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాల్లో వేసవికాలంలో ప్రతి ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయి. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు ఆపైన నమోదవుతున్నాయి. మార్చి నుంచి జూన్ మొదటి వారం వరకు అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. ఉదయం 11 గంటల నుంచే ఎండకు ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి ప్రజలు వెనకాడుతున్నారు. ఇళ్లల్లో ఉక్కపోతకు ఉండలేని పరిస్థితి. ఫ్యాను గాలి కూడా వేడిగా వస్తుంది. ఈ క్రమంలో రక్షణ పొందేందుకు సామాన్యుల మొదలు అన్నివర్గాల ప్రజలు కూలర్లు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.


విద్యానగర్‌లోని ఎలక్ట్రానిక్ దుకాణంలో కొనుగోలుదారులతో రద్దీ

- ఏసీ, ఫ్రిడ్జ్ కూలర్లకు గిరాకీ
- గతేడాది కంటే 10 శాతం పెరిగిన రేట్లు
- ధరలు పట్టించుకోని వినియోగదారులు

కొత్తగూడెంఅర్బన్: పారిశ్రామిక పాంతమైన కొత్తగూడెంలో వేసవికాలంలో ప్రతి ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటాయి. మార్చి నుంచి జూన్ మొదటి వారం వరకు అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. బొగ్గగనుల ప్రాంతమైన కొత్తగూడెంలో ఉదయం 10 గంటల నుంచే భానుడు ఉగ్రరూపం చూపిస్తుంటాడు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కపోత కూడా అధికంగా ఉంది. దీనికి సాధారణ ఫ్యాన్ల నుంచి ఉపశమనం లభించటం లేదు. ఈ క్రమంలో ఇంటికి, వంటికి చల్లదనం ఇచ్చే పరికరాలను కొనుగోలు చేస్తుంటారు ప్రజలు. ప్రస్తుతం కొత్తగూడెంలోని ఏసీ, ఫ్రిడ్జ్, కూలర్ల షోరూంలలో వినియోగదారుల రద్దీ పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది కూలింగ్ పరికరాల ధరలు పది శాతం పెరిగాయని షోరూంల యజమానులు చెబుతున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొత్తగూడెంలో 41 డిగ్రీల వరకు ఉష్ణోగత నమోదవుతున్న నేపథ్యంలో సాయంత్రం 6 దాటినా కూడా వేడి తగ్గడం లేదు. దీంతో ప్రజలు చల్లదనం అందించే పరికరాలు, యంత్రాలను కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్తున్నారు. ఒక్కో షోరూంలో రోజుకు ప్రస్తుతం 50 – 60 మంది వరకు వివిధ పరికరాలను కొనుగోలు చేస్తున్నారని షోరూంల యజమానులు చెబుతున్నారు. మాములు సమయంలో రోజుకు పది రావడం కూడా కష్టంగానే ఉండేదని, వేసవి కావడంతో గిరాకీ పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. కొత్తగూడెంలో బ్రాండ్ కలిగిన దాదాపు పది వరకు ఎలక్ట్రానిక్ పరికరాలు అమ్మే షోరూంలున్నాయి. ఇక సాధారణ కూలర్లు ఎక్కడపడితే అక్కడ చిన్న చిన్న దుకాణాలలో కూడా అమ్మకాలు చేస్తున్నారు. కొంతమంది ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి కూలర్ విడిభాగాలను తీసుకొచ్చి కూలర్లు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు.

షోరూంలలో ధరలు ఇలా...

వేసవి కాలంలో ఏసీ, కూలర్లు, ఫ్రిజ్‌లు అమ్మకాలు చేసే దుకాణాలలో కొనుగోలుదారులతో రద్దీ పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఏసీ, ఫ్రిడ్జ్ ధరలు 10 శాతం వరకు పెరిగాయి. అయినా అమ్మకాలు తగ్గలేదని, ధర పట్టింపు లేకుండా వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. షోరూంలలో కూలర్ల ధరలు రూ.9 – 20 వేల వరకు, ఏసీలు రూ.35 – 75 వేల వరకు, ఫ్రిడ్జ్ ధరలు రూ.14 – 80 వేల వరకు ఉన్నాయి. ఇక అసెంబుల్డ్ కూలర్ల ధరలు రూ.4 – 10 వేల వరకు ఉన్నాయి.

అమ్మకాలు పెరిగాయి



గత ఏడాది వేసవికాలంతో పోలిస్తే ఈ ఏడాది ఏసీలు, ఫ్రీజ్‌ల ధరలు పెరిగాయి. అయినా వేసవికాలం కావడంతో అమ్మకాలు పెరిగాయి. ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. – మనీష్, బ్రాంచ్ నిర్వాహకుడు

ధరలు పెరిగినా తప్పడం లేదు



వేసవి ఉష్ణోగ్రతలు భరించలేక ధరలు పెరిగినా కొనుగోలు చేయక తప్పడం లేదు. ప్రస్తుతం వేడి భరించాలంటే ఇంట్లో ఏసీలు, కూలర్లు తప్పనిసరి. లేదంటే ఆరోగ్యం మీద ప్రభావం పడుతుందని కొంటున్నాం. – హామీద్, వినియోగదారుడు

ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి జాతర


సరువులును దర్శించుకుంటున్న ఆదివాసీలు

జూలూరుపాడు: ఆదివాసీ నాయకపోడుల కులదైవమైన శ్రీపెద్దమ్మ తల్లి జాతర పడమటనర్సాపురం గ్రామంలో వైభవంగా కొనసాగుతోంది. శనివారం సరువులు(శ్రీపెద్దమ్మతల్లి, శ్రీపోతురాజు, యాదవ కులదైవాలకు ప్రతీకగా పిలువ బడే చంద్ర చెట్లు)ను అడవి నుంచి ఆలయానికి మేళతాళాలతో ఊరేగింపు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఆదివాసీ నాయకపోడులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శ్రీపెద్దమ్మతల్లి కల్యాణం జరగనుందని, అనంతరం అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

టేకులపల్లి: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు, కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నర్సాయిగూడెంలోని వజ్జ పాపయ్య కుంట, తొమ్మిదోమైలు తండాలోని చింత బాలయ్య కుంటల వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కూలీలకు రోజు కూలి రూ.272 ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ కొలతల పేరుతో మోసం చేస్తోందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతుంటే సామాన్య ప్రజల నడ్డి విరిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పరిపాలన చేస్తున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.750 చెల్లించాలని, 200 పది దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోత్ రామచందర్, రమేష్, అంజయ్య, లింగయ్య, యాలాద్రి, శ్రీధర్, సారయ్య, పద్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి ప్రభుత్వానిదే బాధ్యత


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కామేష్

ఇల్లెందు: రాష్ట్రంలో అధికారం తమదేనని బీఆర్ఎస్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ ఆరోపించారు. చీమలపాడులో జరిగిన ప్రమాద ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందులో బీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. కారేపల్లి మండలం చీమలపాడు గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం కారణంగా నలుగురు మృతి చెందగా పలువురు తీవ్రగాయాలపాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులకు రూ.50 లక్షలు, మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఇర్పా రవికుమార్, బాదావత్ ప్రతాప్, రాయల శ్రీనివాస్, టి.సత్యనారాయణ, లేతాకుల కాంతారావు, చిప్పలపల్లి శ్రీనివాసరావు, పులిమాటి జ్ఞాన సుందరం, తచ్చడి జయరాం, కాంపాటి కిరణ్, లోకేష్, వాసు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీసు


నోటీసు అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తమ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తయినందున ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంపీడీఓ అప్పారావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు యాకరాజు, సుస్మిత మాట్లాడుతూ.. తాము నియమితులైన సమయంలో మూడేళ్ల ప్రొబేషన్ పిరియడ్ విధించారని, దానిని నాలుగేళ్లు పొడగిస్తూ జీఓ నంబర్ 26ను అమలులోకి తెచ్చినట్లు చెప్పారు. అది కూడా పూర్తయినందున రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయంలో ఆలస్యం జరుగుతున్నందున పలు డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 28 వరకు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూసి సమ్మెకు వెళతామని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పని వేళలు మార్చండి

ఇల్లెందు: వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా కార్మికుల పని వేళలు మార్చాలని ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకుబ్‌షావలీ మున్సిపల్ కమిషనర్ అంకుషావలీని కోరారు. శనివారం ఇల్లెందులో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ శానిటేషన్, వాటర్ వర్క్స్ కార్మికులను ఎండ వేడి నుంచి రక్షించాలని కోరారు. వెంకన్న, మహేష్, సంపత్, సంజీవ్, రఫీ, పాషా, రాజు, రాజమ్మ పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: సీపీఐ తలపెట్టిన ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని, ఈ నెల 17న యాత్ర ఇల్లెందుకు చేరుకుంటుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య తెలిపారు. శనివారం ఇల్లెందులో జరిగిన గ్రూపు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ హటావో.. దేశ్‌కి బచావో కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సదానందం, శ్రీకాంత్, గాంధీ, రామ్మూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

రామాలయం హుండీ లెక్కింపు


పరిశీలిస్తున్న ఈఓ రజనీకుమారి

పాల్వంచ: పట్టణంలోని శాస్త్రీ రోడ్‌లోని భజన మందిర రామాలయంలో శనివారం హుండీని లెక్కించారు. ఆలయ ఈఓ రజనీకుమారి ఆధ్వర్యంలో 2022 మార్చి 23వ తేదీ నుంచి శుక్రవారం వరకు భక్తులు ఆలయంలోని హుండీలో వేసిన నగదును లెక్కించారు. హుండీ ఆదాయం రూ.1,57,326 నగదు వచ్చింది. కార్యక్రమంలో మాజీ ధర్మకర్త చలవాది ప్రకాశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బేల్‌సింగ్, పెద్దమ్మ తల్లి గుడి జూనియర్ అసిస్టెంట్ నరసింహారావు, భక్తులు, వందనపు గౌరీ, బచ్చు విజయ, ఉమ, కాశి, శివ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటా..


ముస్లింలతో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: యావత్ ప్రజలంతా సుఖశాంతులతో వర్థిల్లాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. శనివారం పట్టణంలోని సింగరేణి స్కూల్ ఆవరణలో కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఏటా రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షల్లో ఉంటూ మానవాళికి మేలు జరుగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారని అలాంటి వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయటం వారి త్యాగానికి, ఐక్యతకు చిహ్నమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో వారితో కలిసి పాలు పంచుకోవటం మనందరి అదృష్టమన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ రాజకీయంగానే కాకుండా సామాజికంగా ఆర్థికంగా ఏ అవసరం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటామని, మీలో ఒక్కరిగా భావించాలని కోరారు. మండల రాము, పూనెం సురేందర్, కృష్ణప్రసాద్, మడుగు సాంబమూర్తి, ముక్తి కృష్ణ, తాటి భిక్షం, బోళ్ల సూర్యం, బోళ్ల సాగర్, మహమూద్ హాజరయ్యారు.

తొమ్మిదో మైలు తండాలో పరామర్శ..

టేకులపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం తొమ్మిదో మైలు తండాలో పర్యటించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, బేతంపూడి ఎంపీటీసీ బాణోతు పూర్ణలతో కలిసి ఇటీవల మృతి చెందిన ఇస్లావత్ రాములు, ఇస్లావత్ అఖిల్, భూక్య హరిలాల్, గుగులోత్ దేవ్‌సింగ్, దారావత్ ద్వాలి, పక్షవాతంతో మంచం పట్టిన గుగులోత్ భావ్‌సింగ్ కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు.

చర్చలు విఫలం.. సమ్మెకు సిద్ధం

సూపర్‌బజార్(కొత్తగూడెం): చర్చలు విఫలమైనందున విద్యుత్ కార్మికుల సమస్యలపై ఈనెల 17 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు టీఎస్ పీఈ జేఏసీ నాయకులు శనివారం ప్రకటించారు. ఏప్రిల్ 1, 2022 వేతన సవరణ, ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయడం, అన్ మ్యాన్డ్, స్పాట్ బిల్లర్స్, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనం, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ, సింగిల్ మస్టర్ స్కేల్ తదితర డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నిసార్లు యాజమాన్యంతో చర్చలు జరిపినప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం చొరవ చూపలేదని నాయకులు విమర్శించారు. సర్కిల్ కార్యాలయంలో సమావేశమై సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఇంజనీర్లు, యూనియన్లు కలిసి జేఏసీగా ఏర్పడి సమ్మె చేస్తున్నట్లు వివరించారు.

కార్యక్రమంలో సీహెచ్ మోహనరావు, కె.జీవన్‌కుమార్, వి.రాజేష్, ఎ.రఘురామయ్య, బి.వెంకటరాజు, ఉదయ్‌రత్నకుమార్, జి.నరసింహారావు, టి.వేణు, హెచ్.దేవా, హేమంత్, పులి గణేష్, ఎస్.వెంకటేశ్వర్లు, బి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు అన్యాయం


మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: అనేక సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతుల నుంచి పోడుభూములను లాక్కుని కేసీఆర్ అన్యాయం చేశాడని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. చంద్రాలగూడెం, రేగులగూడెం, మల్లారం, కొత్తూరు, నర్సింహాసాగర్ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే బతుకులు మారతాయని ఆశించిన ప్రజల ఆశలను కేసీఆర్ వమ్ము చేశాడని విమర్శించారు. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనుల భూములను హరితహారం పేరుతో లాక్కొని గిరిజనులను దగా చేశారని ఆరోపించారు. గిరిజనుల చిరకాల స్వప్నమైన పేసువాగు నిర్మాణం చేయకుండా స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేశారన్నారు. అర్హత కలిగిన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇస్తామని చెప్పి నేటికీ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలకులు అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. కొండం వెంకన్నగౌడ్, నూకల రంగారావు, పైడిపల్లి మనోహర్, బత్తుల వెంకటేశ్వరరావు, కట్టా సోమయ్య, గుండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొప్పురాయిలో ఎమ్మెల్సీ పర్యటన


రఘోత్తంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొప్పురాయి గ్రామంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి శనివారం పర్యటించారు. ఇదే గ్రామానికి చెందిన ఆదర్శ ఉపాధ్యాయుడు దేవవరపు సీతారామయ్య కొప్పురాయి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూనే గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మరణించడంతో జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవవరపు వెంకటేశ్వర్లు తల్లిదండ్రుల సేవలకు గుర్తుగా సీతారామయ్య-ఇంద్రావతిల విగ్రహాన్ని పాఠశాల వద్ద గతంలో ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఆ విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆనాడు సీతారామయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాణోతు రవి, మండల అధ్యక్షుడు జి.మోతీలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్, సర్కార్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం


మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సొసైటీ ద్వారా ఆరు కేంద్రాలను మండలంలో సిద్ధం చేసినట్లు డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, వ్యవసాయ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ.. మండలంలోని ప్రభాత్‌నగర్, కారేగట్టు, సోములగూడెం, దంతెలబోర, పాల్వంచ పట్టణంలోని గుడిపాడు గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు ధాన్యాన్ని తమ కల్లాల వద్దనే ఎండబెట్టుకుని తేమ 17శాతం వచ్చిన తర్వాత వ్యవసాయ శాఖాధికారుల వద్ద నుంచి టోకెన్ తీసుకున్న తర్వాత ధాన్యాన్ని కేంద్రాలను తీసుకురావాలన్నారు. భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, వ్యవసాయ శాఖాధికారులతో సర్టిఫై చేయించుకుని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్, ఏఓ పి.శంభోశంకర్, ఏఈవోలు ఎ.సత్యం, భాను, డైరెక్టర్లు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, సామా జనార్దన్ రెడ్డి, పాపారావు, సీతారాం బాబు, మైనేని వెంకటేశ్వరరావు, కిషన్, సీఈఓ జి.లక్ష్మీనారాయణ, సెంటర్ ఇన్‌చార్జ్‌లు సంపత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా పైపులైన్ గుంత

పాల్వంచలో ఇందిరానగర్ కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్ పక్కన మిషన్ భగీరథ పైపులైన్ గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో కాలనీవాసుల పాలిట పైపులైన్ గుంత ప్రమాదకరంగా మారింది. పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. గుంత పూడ్చాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న పైపులైన్ గుంతను వెంటనే పూడ్చివేయాలని కోరుతున్నారు. – పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్
సెల్ నంబర్ : 9849905884